క్లుప్తంగా

నేడు మత్స్యలింగం నామినేషన్‌కు తరలిరండి

ముంచంగిపుట్టు: వైఎస్సార్‌సీపీ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం సోమవారం పాడేరులో నామినేషన్ దాఖలు చేయనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరులో ఉదయం 11గంటలకు వేయనున్న నామినేషన్‌కు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

పాడేరు అసెంబ్లీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు ప్రచారం నేడు

చింతపల్లిరూరల్: పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నవరంలో సోమవారం పర్యటించనున్నట్టు జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య తెలిపారు. ఇక్కడి సంతలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు అందరూ వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



పోతవరంలోని ర్యాలీలో భక్తులు

కొయ్యూరు: మండంలోని పోతవరం, ములకలపాడులో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో సత్సంగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలన్నారు. సత్సంగ్‌లో భక్తిగీతాలు ఆలపించారు. పద్మ, గిరిధర్, ప్రమోద్, పద్మజ, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం నేతల ప్రచారం

అరకులోయ రూరల్: మండలంలోని చినలబుడు పంచాయతీ దొరవలసలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలదేవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీపీఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంటనర్స తరపున ప్రచారం చేశారు. నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పనస అ'ధర'హో

- జోరుగా పనసకాయల వ్యాపారం
- ఒడిశాకు వేలాది టన్నుల సరఫరా



వ్యాన్‌లో ఒడిశాకు తరలిస్తున్న పనసకాయలు



ముంచంగిపుట్టు సంతలో వ్యాపారులు కొనుగోలు చేసిన పనసకాయలు

ముంచంగిపుట్టు: ప్రస్తుతం మన్యంలో పనస దిగుబడి విరగ్గాసింది. ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో పనసకాయల వ్యాపారం భారీగా జరుగుతుంది. ఒడిశాలో పనసకాయలకు గిరాకీ నెలకొన్న నేపథ్యంలో వ్యాపారులు గ్రామాల్లోకి వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. రోజూ ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని గిరిజన గ్రా మాల నుంచి వ్యాన్లు, లారీల్లో పనసకాయలను తరలిస్తున్నారు.

వారపు సంతల్లో ఈసారి కిలో పనసకాయల ధర ఎన్నడూ లేని విధంగా మొదట్లో రూ.15 నుంచి రూ.25 వరకు ధర పలికింది.తాజాగా కిలో.50 వరకు విక్రయిస్తున్నారు. వర్షాలు మొదలైతే పనసకాయలు పాడైపోతాయి అనే ఉద్దేశంతో ముందుగానే కాయలను చెట్టు నుంచి కోసి మార్కెట్‌కు తరలిస్తున్నారు.పనసలో రెండు రకాలు ఉంటాయి.అందులో ఖర్జూరం రకం కాయలను పండ్లుగా విక్రయించేందుకు చెట్లకే ఉంచేశారు. ముదురితే పనికిరాని గుజ్జు రకం పనసకాయలను మార్కెట్‌కు సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా ముంచంగిపుట్టు, పెదబయలు, హుకుంపేట మండలాల నుంచి ఒడిశాలోని జయపురం మార్కెట్‌కు రోజు 100 టన్నుల వరకు పనస కాయలను వ్యాపారులు తరలిస్తున్నారు.జయపురం మార్కెట్ నుంచి కటక్, కోల్‌కతా తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. మన్యంలో ఈ ఏడాది పనసకాయలు విరగ్గాసాయి. ఒడిశాలో బరంపురం, జయపురం, గుజరాత్ ,కోల్‌కతా ప్రాంతాల్లో జరిగే పెళ్లిళ్లలో పనసకాయల వినియోగం ఎక్కువ. ముఖ్యంగా పచ్చళ్ల, పకోడీలు, పొట్టు కూర, కుర్మా, వంటకాలతో పాటు ఇడ్లీ, బూరెలు, చిప్స్ వంటి ఆహార పదార్థాల్లో అధికంగా వాడుతారు. ప్రస్తుతం మార్కెట్ బాగుండడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆశాజనకంగా లాభాలు

ఈ ఏడాది పనసకాయలు చెట్లుకు విరగ్గాసాయి. ఒడిశా నుంచి వ్యాపారులు గ్రామానికి వచ్చి పనస కాయలు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. గతంలో పనస పండ్ల వ్యాపారం బాగుండేది. ప్రస్తుతం పనసకాయల వ్యాపారం బాగుంది. కాయ సైజును బట్టి రూ.10 నుంచి రూ.20 వరకు కొనుగోలు చేస్తున్నారు. కిలో రూ.50వరకు పనసకాయలు కొన్ని ప్రాంతాల్లో కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్ బాగుండడంతో కాయలనే త్వరితగతిన విక్రయిస్తున్నాం. – కె.సుబ్బారావు, తాల్లబుతోట గ్రామం, ముంచంగిపుట్టు మండలం

జోరుగా వ్యాపారం

ఒడిశా రాష్ట్రంలో పనసకాయలకు మంచి డిమాండ్ ఉండడంతో పనసకాయల సీజన్ మొదలు అయినా నెల నుంచి ఒడిశా వ్యాపారులు గ్రామాల్లో, వారపు సంతల్లో వచ్చి పనసకాయలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో పనసకాయల సేకరణలో రోజు బిజీబిజీగా ఉంటున్నాం. ఒక రోజు 300 వరకు పనసకాయలు అమ్ముతున్నాము. గ్రామం నుంచి రెండు,మూడు వరకు వ్యాన్లు పనసకాయల లోడ్లతో వెళుతున్నాయి. – ఎస్.భాగ్యవతి, నర్సీపుట్టు గ్రామం. ముంచంగిపుట్టు మండలం

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ట్రెక్కింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

చింతపల్లిరూరల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి అన్నారు. ఆమె ఆధ్వర్యంలో ఆదివారం డిగ్రీ కళాశాల విద్యార్థులు స్థానిక ఈఎంఆర్‌ఎస్ పాఠశాల వెనుక ఉన్న కొండపై సుమారు 6 కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు, వ్యాయామాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. లక్ష్యాలతో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉత్సాహంగా ట్రెక్కింగ్‌లో పాల్గొన్నట్టు చెప్పారు ఉపాధ్యాయులు పావని, బాలరాజు, నాగేశ్వరరావు, లైబ్రేరియన్ జగత్‌రాయ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అసిస్టెంట్ కమాండెంట్ సందీప్‌రెడ్డి

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

చింతూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ప్రాథమిక స్థాయిలో విద్యతో మంచిగా రాణించాలని సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సందీప్‌రెడ్డి అన్నారు. చింతూరు మండలం అల్లిగూడెంలో ఆదివారం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన భవిష్యత్తులో సాధించబోయే లక్ష్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలిచ్చారు. మంచి మార్కులు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సీఆర్‌పీఎఫ్–141, 42 బెటాలియన్ల ఆధ్వర్యంలో సివిక్‌యాక్షన్ కార్యక్రమాల ద్వారా గ్రామాలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు.. రాకపోకలకు అంతరాయం

వై.రామవరం: మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన గాలివానకు వై.రామవరం నుంచి యార్లగడ్డ గ్రామం మీదుగా మండల ఎగువ ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారిలో పెద్ద మామిడ చెట్టు రోడ్డు పై కూలింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆదివారం కురిసిన గాలివానకు మామిడి, జీడిమామిడి కాయలు రాలిపోవడంతో రైతులు ఆందోళన చెందారు.



కొండవాగు వంతెనపై ఈదురుగాలులు, వర్షబీభత్సానికి రోడ్డుపై కూలిన మామిడిచెట్టు

ప్రశాంతంగా గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష



రాజవొమ్మంగిలో పరీక్ష రాస్తున్న చిన్నారులు



అడ్డతీగలలో పరీక్షను పరిశీలిస్తున్న అబ్జర్వర్ ఆంజనేయులు తదితరులు

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కేంద్రంగా ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్షలకు 43 మంది హాజరైనట్టు ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా గల గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9 వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకు ఈ పరీక్ష జరిగిందన్నారు. ఆదివారం జరిగిన పరీక్షకు 169 మంది హాజరై ప్రవేశపరీక్ష రాసినట్టు చెప్పారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా ఎం.వి.కృష్ణారావు వ్యవహరించారు.

అడ్డతీగల: గురుకుల పాఠశాలలో ఐదు నుంచి తొమ్మిదో తరగతి వరకూ ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు అడ్డతీగల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ కెవి హరినాథరావు తెలిపారు. స్థానిక గురుకుల పాఠశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 277 మందికి 205 మంది హాజరైనట్టు తెలిపారు. పరీక్షల నిర్వహణను అబ్జర్వర్ పి.ఎస్.ఆర్.ఆంజనేయులు పరిశీలించారు.

ఠారెత్తించిన ఎండలు.. ప్రజలు బెంబేలు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఎండ స్థానికులను ఠారెత్తించింది. ఉదయం 10 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో బయటకొచ్చేందుకు జనం భయపడ్డారు. వడగాడ్పులు, తీవ్రమైన వేడిమికి, ఉక్కపోతకు పిల్లలు,పెద్దలు అల్లాడారు. ఎండ వేడిమి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. రహదారులు నిర్మానుష్యంగా మారాయి. మూగజీవుల చెట్ల నీడన ఆశ్రయించాయి. శీతల పానీయాలు, కొబ్బరి బొండాలను ఆశ్రయించారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయని ఆందోళన చెందుతున్నారు. కాగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు మేఘాలు కమ్ముకొని వాతావరణం కాస్త చల్లబడడంతో మండల వాసులు ఊరట చెందారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అరుణకుమారి

మారేడుమిల్లి: ఏటపాక నవోదయ స్కూల్‌లో ఈ నెల 19న జరిగిన డిస్ట్రిక్ట్ లెవెల్ ప్రేరణ ఉత్సవ్ ప్రోగ్రాంలో స్థానిక ఏకలవ్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ టి.అరుణకుమారి ఆదివారం చెప్పారు. పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు కాకూరి భవాని శంకర్ రెడ్డి, మిర్తివాడ గిరిజా డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో పాల్గొని వారి ప్రతిభను కనబరిచి డిస్టిక్ లెవెల్‌కు సెలెక్ట్ అయినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. సోషల్ టీచర్ సీతమ్మను ఆమె అభినందించారు.

సర్టిఫికెట్లు పోయాయి

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ అసరాడ గ్రామానికి చెందిన కిరసాని పద్మావతి అనే గిరిజన విద్యార్థిని తన ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు శనివారం ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని ఓ దుకాణం వద్ద పోగొట్టుకుంది. సర్టిఫికెట్లు ఎవరికి దొరికిన అందించాలని ఆమె వేడుకుంది. ఓ సంచిలో 10వ తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు, మార్కులిస్టు, ఆధార్, పాన్ కార్డులు ఒరిజినల్స్‌తో పాటు బ్యాంకు పాస్ పుస్తకాలు అన్ని ఉన్నట్టు పేర్కొన్నారు. ఎవరికైనా ఆయా సర్టిఫికెట్లు దొరికితే 93904 11563 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆమె కోరారు.